సీఎం కేసీఆర్ హయాంలోనే విండోల అభివృద్ధి

మాట్లాడుతున్న పెద్దకొడప్‌గల్ సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి

మాట్లాడుతున్న చిన్నకొడప్‌గల్ విండో చైర్మన్ నారాయణరెడ్డి

మహాజన సభల్లో చైర్మన్లు

పిట్లం, సెప్టెంబర్ 30: కేసీఆర్ సీఎంగా బాధ్యతలను చేపట్టిన అనంతరం రాష్ట్రంలోని సహకార సంఘాలు అభివృద్ధి చెందాయని చిన్నకొడప్‌గల్ విండో చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. సహకార సంఘం మహాజన సభను శనివారం నిర్వహించారు. రాంపూర్ సహకార సంఘం మహాజన సభను చైర్మన్ శపథంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్లు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సహకార సంఘాలు బలోపేతం అయ్యాయని తెలిపారు. చిన్నకొడప్‌గల్ సొసైటీ పరిధిలో రుణమాఫీ అయిన రైతులకు రుణాలు అందజేశామని, కొత్త సభ్యులకు కూడా రుణాలు ఇచ్చామని చెప్పారు. కాటేపల్లిలో గిడ్డంగి నిర్మాణం, ధాన్యం కొనుగోలు కోసం అవసరమైన కాంటా కొనుగోలు కోసం తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కవితా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, రుక్మిణీ నారాయణ, ఉపసర్పంచ్ శశికాంత్, విండో వైస్ చైర్మన్ సాయాగౌడ్, డైరెక్టర్లు, సీఈవో హన్మాండ్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభలో మాట్లాడుతున్న బిచ్కుంద విండో చైర్మన్ బాలాజీ

గోదాముల నిర్మాణం చేపట్టాలి..

నిజాంసాగర్, సెప్టెంబర్ 30: బిచ్కుంద సొసైటీ ఆవరణలో శనివారం చైర్మన్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో రైతులకు ఉపయోగపడే గోదాములను నిర్మించాలని రైతులు కోరడంతో ఈ మేరకు తీర్మానించారు. చైర్మన్ బాలాజీ అధ్యక్షతన కొనసాగిన మహాజన సభలో సీఈవో శ్రావణ్ జమా ఖర్చుల నివేదికను చదివి వినిపించారు. అనంతరం 13 గ్రామాల్లో గోదాముల నిర్మాణం చేపట్టాలని, సొసైటీ పరిధిలోని రైస్‌మిల్లును అప్‌గ్రేడ్ చేసుకోవాలని తీర్మానించారు. రైతులు సంఘంలో తీసుకున్న రుణాలను సక్రమంగా సకాలంలో చెల్లిస్తేనే సంఘం లాభాల బాటలో పయనిస్తుందని అన్నారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు యాదవ్ రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

36 మంది రైతులకు రుణమాఫీ..

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విండోలోని 36 మంది రైతుకు 27లక్షల 55వేల రూపాయలను మాఫీ చేసిందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మొత్తం 284మంది సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిపారు. 60 మంది సభ్యులకు సల్పకాలిక రుణాలు రూ.30,72,500 అందజేశామన్నారు. రుణాలు చెల్లించిన రైతులకు తిరిగి రుణాలను అందజేస్తామని తెలిపారు. అనంతరం సీఈవో సందీప్ సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. సర్పంచ్ తిర్మల్‌రెడ్డి, డైరెక్టర్ దస్తారెడ్డి, మాజీ చైర్మన్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

డోంగ్లీ, సెప్టెంబర్ 30: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ గిరీశ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి సీజనల్ వ్యాధులతో రోగులు శనివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరీశ్ వారిని పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ కూడా సోకుతుందని, ఇది స్కూల్ పిల్లలకు ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండుసార్లు స్నానం చేయాలన్నారు. డోంగ్లీ పీహెచ్‌సీలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా తదితర అన్ని రకాల జ్వరాలకు రక్త పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 30: నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన పోచయ్యకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. పోచయ్య అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అతడికి రూ.15వేలను మంజూరు చేయగా.. బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశామన్నారు. ఈ సందర్భంగా పోచయ్య కుటుంబీకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ

నర్సాపూర్‌లో భూమిపూజలో పాల్గొన్న ఉపసర్పంచ్ రవి తదితరులు

గాంధారి, సెప్టెంబర్ 30: మండలంలోని నర్సాపూర్, మొండిసడాక్ గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు శనివారం భూమిపూజను నిర్వహించారు. మొండిసడాక్‌లో సర్పంచ్ స్వర్ణలతా కృష్ణా గౌడ్, నర్సాపూర్ గ్రామంలో ఉప సర్పంచ్ సోమరిపేట్ రవి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందని చెప్పారు. నిధులను మంజూరు చేయించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేణుకతోపాటు వార్డు సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు శిక్షణ

క్రీడాకారులతో మాట్లాడుతున్న వ్యాయామ ఉపాధ్యాయులు

గాంధారి, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఎల్లారెడ్డి జోనల్ క్రీడాకారులకు రెండు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు పీఈటీలు వెంకటేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్‌రాథోడ్ తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఎల్లారెడ్డి జోన్ చెందిన అండర్ -14, 17 బాలబాలికల వాలీబాల్ జట్లను శనివారం ఎంపిక చేశారు. పోటీల్లో ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట్ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు రెండు రోజులపాటు శిక్షణ ఇస్తామని పీఈటీలు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సంతోష్, బాబూరావు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశువైద్య శిబిరం

తాడ్వాయి, సెప్టెంబర్ 30: మండలంలోని సంతాయిపేట్ గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరం రెండో రోజూ శనివారం కొనసాగింది. గ్రామానికి చెందిన గేదెలు గురువారం సాయంత్రం భీమేశ్వర వాగులో కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. వాటిని గ్రామస్తులు రక్షించారు. కాగా 20 గేదెలకు స్వల్పంగా, మూడు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం గేదెలకు ఎలాంటి ప్రమాదం లేదని పశువైద్యాధికారి రాంచందర్ తెలిపారు. శిబిరంలో వైద్య సిబ్బంది బాలు, మహిపాల్‌రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై

గాంధారి, సెప్టెంబర్ 30: పోగొట్టుకున్న మొబైల్‌ను బాధితురాలికి అందజేసినట్లు గాంధారి ఎస్సై ప్రేమ్‌దీప్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గుమ్మడి సావిత్రి కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సీఈఐఆర్ యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఫోన్ లొకేషన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకొని బాధితురాలికి శనివారం అందజేశారు. ఫోన్ రికవరీకి కృషిచేసిన కానిస్టేబుళ్లను ఎస్సై అభినందించారు.

ఈవీఎంలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న గిర్దావర్ అంజయ్య

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబర్ 30: మండలంలోని తలాబ్ తండా, శివాపూర్, చావుని తండా, పోచారం తండా, అంజని గ్రామాల్లో ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై రెవెన్యూ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిర్దావర్ అంజయ్య మాట్లాడుతూ.. ఓటర్లకు ఈవీఎంపై అవగాహన ఉండాలన్నారు. ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలనే విషయాన్ని వివరించారు.

మంచి శశిధర్‌ను సన్మానిస్తున్న పిట్లం సర్పంచ్ విజయలక్ష్మి

రూ.3.60లక్షలకు లడ్డూ వేలం

పిట్లం, సెప్టెంబర్ 30: మండల కేంద్రంలోని ముకుంద్‌రెడ్డి కాలనీలో గణేశుడి చేతిలోని లడ్డూ రికార్డు స్థాయిలో ధర పలికింది. బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మంచి శశిధర్ లడ్డూను రూ.3.50లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. దీంతో అతడికి నిర్వాహకులు లడ్డూను అందజేశారు. పిట్లం సర్పంచ్ విజయలక్ష్మి స్థానిక గ్రామ పంచాయతీ కార్యలయంలో మంచి శశిధర్‌కు శనివారం శాలువా కప్పి సన్మానించారు. కార్యాక్రమంలో రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు జొన్న శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, వార్డుసభ్యులు బొడ్ల రాజు, నరేందర్, శ్రీహరి, ప్రకాశ్, దేవయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మినుము విత్తనాల పంపిణీ

విత్తనాలను పంపిణీ చేస్తున్న డోంగ్లీ విండో చైర్మన్ విజయ్ పాటిల్

డోంగ్లీ,సెప్టెంబర్ 30: స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో మినుము విత్తనాల పంపిణీని పీఏసీఎస్ చైర్మన్ విజయ్‌పాటిల్ శనివారం ప్రారంభించారు. నాలుగు కిలోల మినుము విత్తనాల బస్తాను రూ.424కు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అవసరం ఉన్న రైతులు సరైన ధ్రువపత్రాలు సమర్పించి విత్తన బస్తాలను తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు రాజు పుండే, మేంగె గణేశ్, ప్రల్హాద్ పుండే, హన్మంత్ ఇంద్రోలే, ఉప కార్యదర్శి వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.